క్లుప్తంగా

పాత్రికేయుల సహకారం అవసరం

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాత్రికేయులు బాగా సహకరించారని, రానున్న స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లో కూడా మరింత సహకారం అందించాలని కలెక్టర్ రాజర్షిషా కోరారు. ఎన్నికలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా మంగళవారం వైస్రాయ్ గార్డెన్‌లో 'సక్సెస్ మీట్' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి పాత్రికేయుల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మజ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితోపాటు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేశ్, కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు మైనంపల్లి పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్ గ్రామానికి చెందిన కార్యకర్తలు కరుణాకర్, ప్రభాకర్ బైక్ ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆయన వారిని పరామర్శించారు. అలాగే కొర్విపల్లిలో కాంగ్రెస్ నాయకుడు పుల్లారావు తండ్రి కిషన్‌రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి రంగారావు, నరేందర్, సురేందర్, బందెల సాయిలు, రామచంద్రం, మాజీ సర్పంచ్‌లు సుధాకర్, బాలయ్య ఉన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): కాంగ్రెస్ కార్యకర్త కొరబోయిన భూమయ్య, కవితల కుమారుడు దినేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారిని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. సర్పంచ్ సాయిలు, మహేందర్‌రెడ్డి, వెంకన్న, పరుశురామ్, పవన్, సాయిలు ఉన్నారు.

సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న విష్ణువర్ధన్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా చేగుంటకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ద్వారా మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. తనను సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, నాయకులు రాజిరెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్నోవేషన్‌లో విద్యార్థుల ప్రతిభ



రెండో స్థానం సాధించిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): రాష్ట్రస్థాయి ఫిజిక్స్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రాంతీయ స్థాయి ప్రదర్శనలో స్థానిక మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రాంతీయ ప్రదర్శనలో పీజీటీ టీచర్ రాజశ్రీ, విద్యార్థులు సాయితేజ, శివాజీ, అభిరామ్ ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభ

నర్సాపూర్: నర్సాపూర్‌లో బుధవారం కంజర్ల ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్ పార్టీ కృతజ్ఞత సభ నిర్వహిస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు, జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి విజయం సాధించిన సందర్భంగా బుధవారం తలపెట్టిన కృతజ్ఞత సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ పిలుపునిచ్చారు.

కోరుకున్న చోటే కొలువు

- యథేచ్ఛగా అక్రమ డిప్యుటేషన్‌లు?
- ఇన్‌చార్జి అధికారులతోనే ఐసీడీఎస్
- ఇష్టారాజ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు
- మంత్రి జిల్లాలో తీరు మారేనా?



సీడీపీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

అల్లాదుర్గం(మెదక్): ఏళ్ల తరబడి సీడీపీఓ కార్యాలయ సిబ్బంది, అధికారులు అక్రమ డిప్యుటేషన్లపైనే విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు బదిలీ కాకున్నప్పటికీ తాము కోరుకున్న చోటకు డిప్యుటేషన్ వేయించుకుని దర్జాగా కొలువులు కొనసాగిస్తున్నారు. దీంతో డిప్యుటేషన్, ఇన్‌చార్జిలతో సీడీపీఓ కార్యాలయ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఉన్నతాధికారుల అండదండలతోనే కొందరు సిబ్బంది డిప్యుటేషన్లతో కోరుకున్న చోట విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా బదిలీపై వెళ్లిన వారి స్థానంలో మరొకరిని నియమించక పోవడం మరి దారుణమని, కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం అవుతోంది.

ఇదీ.. డిప్యుటేషన్ల పర్వం

అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయంలో సిబ్బంది లేక అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు అన్యాయం అయిపోతున్నామని, తమకు చేరాల్సిన ప్రయోజనాలు సక్రమంగా చేరడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో నాలుగు మండలాలు ఉన్నాయి. 9 సెక్టార్లలో, 230 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందాల్సి ఉంది. సీడీపీఓగా లిఖిత 2022 అక్టోబర్‌లో బదిలీపై వచ్చారు. ఆమె అక్టోబర్ 27న జిల్లా కార్యాలయంలో చేరారు. అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయంలో అడుగు పెట్టకుండానే, హైదరాబాదు స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి డిప్యుటేషన్ వేయించుకుని వెళ్లిపోయారు. కాని అధికారులు ఆమె స్థానంలో మరొకరిని నియమించలేదు. దీంతో నర్సాపూర్ సీడీపీఓకు అల్లాదుర్గం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా అక్కడ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి. ఆ విషయం సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెబుతున్నా చర్యలు తీసుకునేవారే కరువయ్యారు. 2020 ఆగస్టులో నిజామాబాద్ జిల్లా నుంచి జ్ఞానేశ్వరి పదోన్నతిపై అల్లాదుర్గం ప్రాజెక్టుకు ఏసీడీపీఓగా బదిలీపై వచ్చారు. ఆమె చేరి వారం రోజుల పాటు సెలవులపై వెళ్లారు. సెలవుల నుంచి తిరిగి వచ్చిన ఆమె నిజామాబాద్ జిల్లా బీమ్‌గల్ ప్రాజెక్టుకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఆమె వెళ్లి రెండేళ్లు గడుస్తున్నా ఆమె స్థానంలో మరొకరిని నియమించలేదు. అల్లాదుర్గం పరిధిలో గ్రేడ్1 సూపర్ వైజర్‌గా నవ్య విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కూడా నాలుగేళ్లుగా హైదరాబాద్‌లోని ఫుడ్ కమిషనరేట్‌కు డిప్యుటేషన్ వెయించుకుని అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఆమె పోస్టులో కూడా ఉన్నతాధికారులు ఎవరినీ నియమించక పోవడం గమనార్హం.

ఖాళీగా కార్యాలయం

అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి సంగారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై వేశారు. అతడితో పాటు పోషణ్ అభియాన్‌కు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నారు. కార్యాలయంలో విధులు నిర్వహించేది వాళ్లిద్దరు మాత్రమే.

కొత్త ప్రభుత్వంతో తీరుమారేనా?

రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానిక ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడైనా అక్రమ డిప్యుటేషన్‌లు రద్దవుతాయా? ఉన్నతాధికారులు స్పందిస్తారా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పదివేల మొక్కలతో నర్సరీలు

ఎంపీడీఓ శ్రీనివాస్



కొడిపల్లి : పనులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి గ్రామ పంచాయతీలో పదివేల మొక్కలతో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో నర్సరీల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి నర్సరీలో పదివేల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం విత్తనాలు నాటేందుకు కవర్లలో మట్టినింపి విత్తనాలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. హరితహారం నాటికి అన్ని రకాల మొక్కలు సిద్ధం చేస్తామన్నారు. మండలంలోని వివిధ నర్సరీలలో 2.90 లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటి వరకు నాటిన ప్రతి మొక్కను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రోడ్లు, డ్రైనేజీలు నిరంతరం శుభ్రపరచాలి

పంచాయతీ అధికారి సతీశ్



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న సతీశ్

నిజాంపేట(మెదక్): నిజాంపేట్ మండలంలోని నందిగామ పంచాయతీలో మంగళవారం పరిసరాల పరిశుభ్రతను పంచాయతీ అధికారి సతీశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రతి రోడ్డు, మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయాలన్నారు. డంపింగ్ యార్డ్‌లో తయారైన కంపోస్టు ఎరువును పీపీపీ ఏవెన్యూ ప్లానిటేషన్‌లోని మొక్కలకు వేయాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని, ప్లాస్టిక్ వస్తువులను అమ్మి ఆ డబ్బులను పంచాయతీ అకౌంట్‌కు జమ చేయాలని సూచించారు. క్రిమిటోరియం చుట్టు మొక్కలు నాటించాలని, పంచాయతీ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, కరోబార్ నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శ



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. తుంటికి గాయం కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నామని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సునీతారెడ్డి తెలిపారు.

నిరుపేదలకు వరం రాజీవ్ ఆరోగ్యశ్రీ

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి



ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న లింబాద్రి

రామాయంపేట(మెదక్): రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.పది లక్షలకు పెంచడం పేద రోగులకు ఎంతో ఉపయోగం అని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రి డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందితో ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పథకం నిరుపేదలకు వరంలాంటిదని, ఈ విషయమై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుప్రియ, జయలక్ష్మి, మణికంఠ, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

- సీఆర్‌ఎఫ్ నుంచి రూ.38 కోట్లు మంజూరు
- ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



ప్రస్తుత రోడ్డు దుస్థితి

శివ్వంపేట(నర్సాపూర్): గుంతలమయంగా మారి ధ్వంసమైన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని చండి నుంచి గోమారం మీదుగా అనంతరం చైరస్తా వరకు, తూప్రాన్ - నర్సాపూర్ హైవే నుంచి ఉసిరికపల్లి చౌరస్తా నుంచి పోతులబోగూడ వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో ఈ రోడ్డు గుండా వాహనదారులు ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సీఆర్‌ఎఫ్ నిధులు మంజూరు కావడంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి.

నిధులు మంజూరు

పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్డుని ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్పు చేశారు. 18 కిలో మిటర్ల రోడ్డు విస్తరణ కోసం సెంట్రల్ రోడ్డు ఫండింగ్ (సీఆర్‌ఎఫ్) నుంచి రూ.38 కోట్లు మంజూరయ్యాయి. అందుకు సంబంధించి పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. చండి నుంచి రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మిస్తుండడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణతో హైదరాబాదుకు వెళ్లేందుకు ఈ రోడ్డు చాలా అనువుగా ఉండడంతో పాటు జిల్లా కేంద్రం మెదక్ వెళ్లేందుకు దగ్గర అవుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

18 నెలల్లో పనులు పూర్తి

దెబ్బతిన్న రోడ్డును 18 నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు మార్చాం. చండి నుంచి నవాబుపేట, ఉసిరికపల్లి నుంచి పోతులబోగూడ, దొంతి బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డును కూడా డబుల్ రోడ్డుగా నిర్మిస్తాం.

– శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈ

దూరభారం



మా గ్రామం నుంచి హైదరాబాదుకు వెళ్లేందుకు రోడ్డు పాడైపోవడంతో నర్సాపూర్ నుంచి దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తుంది. డబుల్ రోడ్డుగా మారితే గోమారం నుంచి గుమ్మడిదల మీదుగా హైదరాబాదుకు వెళ్లేందుకు అనువుగా ఉంటుంది.

– మధుసూదన్, ఉద్యోగి, చండి

అభివృద్ధి పథంలో గ్రామాలు



రోడ్డు ధ్వంసం కావడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులు సైతం రద్దు అయ్యాయి. ఈ రోడ్డు విస్తరణ పరిసర గ్రామాలు వ్యాపార పరంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.

– రాజశేఖర్‌గౌడ్, పాంబండ

తొలగనున్న ఇబ్బందులు



రోడ్డు గుంతలు పడడంతో గ్రామాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సి నవచ్చింది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

–లావణ్యరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు

బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి మంగళవారం అమావాస్య సందర్భంగా వేద పండితుడు, ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, పలువురు ప్రముఖులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పైకప్పులేని మ్యాన్‌హోల్

నర్సాపూర్: విఘ్నేశ్వర కాలనీలోని ఓ మ్యాన్‌హోల్‌పై పైకప్పు లేక ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని ఓ ప్రైవేటు క్లినిక్ ఎదుటగల డ్రైనేజీపై పైకప్పు వేయలేదు. ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని వారు వాపోయారు. మ్యాన్‌హోల్ పైకప్పు ఏర్పాటు చేయాలని కోరారు.



పైకప్పు లేని మ్యాన్‌హోల్

లాక్యా తండాలో గుడిసె దగ్ధం



దగ్ధమవుతున్న గుడిసె

రామాయంపేట(మెదక్): మండలంలోని కిషన్ తండా పంచాయతీ పరిధిలోని లాక్యా తండాలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక గుడిసె దగ్ధమైంది. తండాకు చెందిన మేగావత్ పండి ఇంటికి తాళంవేసి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలో గుడిసె పూర్తిగా కాలిబూడిదైంది. అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు బియ్యం, నగదు, దుస్తులు మంటలకు ఆహుతయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. కాని అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. బాధితుడిని ఆదుకోవాలని తండావాసులు విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా శివ మహాపడిపూజ



రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో యూత్ కాంగ్రెస్ యువ నాయకుడు, శివస్వామి చక్రపాణి సోమవారం రాత్రి శివ మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివుడు, అయ్యప్ప గీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదిరాబాద్ రమేశ్ దంపతులు హాజరయ్యారు.

◆ నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి(తూప్రాన్): ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

◆ ఇంటివద్దే ఈకేవైసీ

నర్సాపూర్: సబ్సిడీపై వంట గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ కేవైసీ కోసం మహిళలు గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. నర్సాపూర్‌లోని హెచ్‌పీ గ్యాస్ సరఫరా సెంటరు వద్ద మంగళవారం మహిళలు బయోమెట్రిక్ చేయించుకునేందుకు పడిగాపులు పడ్డారు. సిలిండర్‌పై సబ్సిడీ రావాలంటే ఈ కేవైసీ తప్పనిసరి అని ప్రచారం జరగడంతో మహిళలు గ్యాస్ ఏజెన్సీల వద్దకు చేరారు.

గ్రామాల్లోనే ఈకేవైసీ: గ్యాస్ డీలరు

తమ ఏజెన్సీ పరిధిలో ఉన్న గ్యాస్ వినియోగదారుల వేలిముద్ర సేకరణ కోసం తమ సిబ్బందిని పంపిస్తామని స్థానిక ద్వారకా హెచ్‌పీ గ్యాస్ డీలరు శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే ఆయా గ్రామాలకు బయో మెట్రిక్ మెషిన్లతో వచ్చి తమ సిబ్బంది వినియోగదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు.

◆ భాషా ఉపాధ్యాయుల సమావేశం

కొల్చారం(నర్సాపూర్): స్థానిక ఉన్నత పాఠశాలతో పాటు రంగంపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం కొల్చారం, మెదక్, హవేళిఘణాపూర్ మండలాల తెలుగు, ఆంగ్లభాషా ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో నీలకంఠం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఎంలు కె.ఉపేందర్‌రెడ్డి, పి.శ్రీధర్, జిల్లా రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ రెడ్డి, సీఆర్పీలు సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ ఆరుతడి పంటలతో లాభాలు

కొల్చారం(నర్సాపూర్): యాసంగిలో ఆరుతడి పంటల సాగు ద్వారా లాభం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకుంటే ఏ ఇబ్బంది ఉండదని, 6 నుంచి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



శ్వేతాకుమారి

◆ వాహనం అడ్డగించి.. డబ్బు దోపిడీ

సిద్దిపేటఅర్బన్: గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందని వాహనాన్ని ఆపిన గుర్తుతెలియని వ్యక్తులు డ్రైవర్ వద్ద ఉన్న నగదును అపహరించారు. మంగళవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగధాంపల్లి వద్ద జరిగింది. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లికి చెందిన పస్తం అంజయ్య వాహనంలో హైదరాబాద్ చర్లపల్లి నుంచి జగిత్యాల జిల్లా కోరుట్లకు పరుపుల లోడుతో వెళ్తున్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత ముగ్గురు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని మోపెడ్‌పై వచ్చి వాహనాన్ని అడ్డగించారు. గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందని వాహనాన్ని తనిఖీ చేయాలని బుకాయించారు. భయపడిన డ్రైవర్ వాహనంలో ఉన్న రూ.40 వేలను చేతిలో పట్టుకోగా వాటిని లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.